
ఇన్‌ఫిల్టర్ బావికి నాగావళి నది నీరు అందని దృశ్యం

# ప్రజల కష్టాలు

## జగనన్నా.. కనిపించచలేదా..






- జిల్లాకేంద్రంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ
- అట్టహాసంగా సమగ్ర తాగునీటి పథకం నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరణ
- అయితే అంతకుమించి ఏ పనులూ చేపట్టని వైసీపీ సర్కారు
- ప్రస్తుతం మూడు నుంచి నాలుగు రోజులకొకసారి నీటి సరఫరా
- వాటర్ ట్యాంకర్ల కోసం పడిగాపులు
- మండు వేసవిలో పట్టణ వాసులకు తప్పని ఇబ్బందులు
- సమస్య జటిలమవుతున్నా.. స్పందించని ప్రభుత్వం
- ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోని వైనం
- పెదవి విరుస్తున్న పార్వతీపురం వాసులు



పార్వతీపురం బైపాస్ రోడ్డులో ట్యాంకర్ వద్ద నీళ్లు పడుతున్న మహిళలు

(పార్వతీపురం టౌన్, ఏప్రిల్ 23)

'నేను విన్నాను.. నేనున్నాను'.. అంటూ అధికారంలోకి రాకముందు.. వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్ ఎన్నో హామీలిచ్చారు. అయితే ఐదేళ్ల పాలనా కాలం పూర్తయినా కనీసం వాటి గురించి పట్టించుకోకపోవడంపై జిల్లావాసులు మండిపడుతున్నారు. ప్రధానంగా నూతన జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జిల్లాకేంద్రంలో మౌలిక వసతులపై మాత్రం దృష్టి సారించలేదు. పార్వతీపురంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్న హామీ గాలిలో కలిసిపోయింది. వైసీపీ ప్రభుత్వ పాలనలో మెగా తాగునీటి పైలెట్ ప్రాజెక్టుకు అట్టహాసంగా శిలాఫలకం ఆవిష్కరించారు. అయితే ఐదేళ్లలో పనులు మాత్రం పూర్తిచేయలేకపోయారు. దీంతో పట్టణవాసులు తాగునీటికి కటకటలాడాల్సి వస్తోంది. వేసవి కాలంలో అయితే బిందెడు నీటి కోసం పరుగులు పెట్టాల్సి వస్తోంది. ప్రస్తుతం మూడు, నాలుగురోజుకొకసారే కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. మరోవైపు వాటర్ ట్యాంకర్ల కోసం ప్రజలు పడిగాపులు కాయాల్సి వస్తోంది. జిల్లాకేంద్ర నడిబొడ్డున ఉండే ప్రజలతో పాటు పాటు శివారు కాలనీ వాసులు కూడా తాగునీటి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. మొత్తంగా ఐదేళ్ల పాలనలో తాగునీటి సమస్యను పట్టించుకోని వైసీపీ సర్కారుపై జిల్లాకేంద్ర వాసులు మండిపడుతున్నారు.

### ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మున్సిపాల్టీ 1958లో ఏర్పడింది. అయితే 1965లో అప్పటి ప్రజల తాగునీటి అవసరాల కోసం గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామ సమీపంలోని నాగావళి నది నుంచి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. అయితే కాలక్రమంలో అంతా మారింది. అప్పటి పట్టణం ఇప్పుడు జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. అధికారికంగా జిల్లా కేంద్రజనాభా 56 వేలు అని చెబుతున్నా.. అనధికారికంగా 80 వేల మందికి పైగా ఉన్నట్లు అంచనా. అయితే రెండేళ్ల కిందట జిల్లా కేంద్రంగా మారిన పార్వతీపురంలో కాలనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రోజురోజుకూ పట్టణ జనాభా పెరుగుతోంది. మరోవైపు గ్రామీణ ప్రాంతవాసులు సైతం ఉపాధి పనుల కోసం పొట్ట చేతపట్టుకుని పార్వతీపురం వస్తున్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్య తీవ్రతరమవుతుందనేది వాస్తవం. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ప్రణాళికాబద్ధంగా తాగునీటి సరఫరాను చేయడంలో వైసీపీ ప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారనే చెప్పాలి. పట్టణంలోని 30 వార్డుల్లో ప్రజలకు 8.5 ఎంఎల్‌డీ నీరు అవసరం. కానీ 5 ఎంఎల్‌డీ నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. కనీసం మూడు రోజులకొకసారైనా 8 ఎంఎల్‌డీ నీటిని అందించలేక పోతున్నారు. దీంతో జిల్లాకేంద్ర వాసులకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు.

### తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

- గత కొన్నాళ్లుగా పట్టణంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందనే చెప్పాలి. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 10 కోట్లతో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను నేటికీ వినియోగంలోకి తేలేకపోతున్నారు. మున్సిపాల్టీ ఏర్పడిన తొలినాళ్లలో వేసిన తాగునీటి పైప్‌లైన్ తప్ప వైసీపీ ఐదేళ్ల పాలనలో కొత్తగా పైప్‌లైన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ పైప్‌లైన్‌కు ఎక్కడ పడితే అక్కడ లీకులు పడుతుండడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి.


లీకులైన చోట పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

- నాగావళి నదిలో ఏర్పాటు చేసిన నాలుగు ఇన్‌ఫిల్టర్ బావుల్లో రెండు పనిచేస్తుండగా మరో రెండు అలంకార ప్రాయంగా మారాయి. అంతే కాకుండా రెండు ఇన్‌ఫిల్టర్ బావుల్లో ఉన్న మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మరోవైపు ప్రధాన రహదారికి అనుకొని అప్పట్లో పైప్‌లైన్ ఏర్పాటు చేయడంతో తరచూ లీకుల సమస్య పునరావృతం అవుతుంది.


దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న తాగునీటి పథకం శిలాఫలకం

- ప్రస్తుత జనాభాకు తగ్గట్టుగా వైసీపీ ప్రజాప్రతినిధులు తాగునీటి పథకాలను నిర్మించకపోవడంతో జిల్లా కేంద్ర ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్న వైసీపీ సర్కారు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఐదేళ్ల పాలనలో ఆ ఊసే ఎత్తకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.
- ప్రస్తుతం మూడు, నాలుగురోజుకొకసారి మాత్రమే పట్టణవాసులకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. కొన్ని సార్లు బురద నీరే వస్తుండగా.. తప్పనిసరి పరిస్థితుల్లో వాటినే వినియోగిస్తున్నారు.
- పట్టణంలో కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా రెండు, మూడు రోజులకొకసారి నీరు అందిస్తున్నారు. కొన్ని వార్డులకు ఆ సదుపాయం కూడా లేదు. ప్రధానంగా శివారు ప్రాంతవాసులైతే తాగునీటి కోసం తీవ్ర ఇక్కట్లపాలవ్వాల్సి వస్తోంది. ఏటా ఈ సమస్య వేధిస్తున్నా.. వేసవిలో మరింతగా జిల్లాకేంద్రవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. వైసీపీ సర్కారు పట్టించుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### వైసీపీ సర్కారు నిర్లక్ష్యం వల్లే..

వైసీపీ సర్కారు నిర్లక్ష్యం వల్లే జిల్లాకేంద్రంలో తాగునీటి సమస్య మరింత జటిలమైంది. ఎన్నడూ లేని విధంగా పట్టణ నడిబొడ్డులో ఉన్న వీధులకు కూడా పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా కావడం లేదు. ప్రస్తుతం బిందెడు నీటి కోసం పరుగులు పెట్టాల్సి వస్తోంది.

-రమణ, పార్వతీపురం

### తప్పని ఇక్కట్లు

ఏటాలానే ఈ వేసవిలో కూడా తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. ప్రస్తుతం పట్టణంలో మూడు నుంచి నాలుగు రోజులకొకసారి మాత్రమే కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నారు. దీంతో నానా అవస్థలు పడుతున్నాం. ఏదేమైనా వైసీపీ ప్రజాప్రతి నిధులు, అధికారులకు 'ప్రజల' కష్టాలు పట్టకపోవడం దారుణం.

-ప్రభాకరరావు, పార్వతీపురం

### ఏమీ చెప్పలేం..

ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో మెగా పైలెట్ ప్రాజెక్టు పనుల విషయంపై ఏమీ చెప్పలేం. జిల్లా కేంద్ర ప్రజలకు పూర్తిస్థాయిలో తాగు నీరు సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇన్‌ఫిల్టర్ బావులకు నాగావళి నది నీటిని మళ్లించి.. ఈ వేసవిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాం. అంతే కాకుండా మే, జూన్ నెలల్లోనూ తాగునీటి సరఫరాకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశాం.

- కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం

### టీడీపీ హయాంలో అడుగులు పడినా..

పార్వతీపురం పట్టణ వాసులకు సంపూర్ణంగా తాగునీరు అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అడుగులు పడ్డాయి. ఇందుకోసం అప్పటి అంచనాల ప్రకారం రూ.33.33 కోట్లు కేటాయించారు. 2018-19లో తాగునీటి సరఫరాకు సంబంధించి పట్టణంలో పైలట్ ప్రాజెక్టు పనుల ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే ఇంతలో ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. వైసీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి.

### వైసీపీ పాలనలో..

జిల్లా కేంద్ర ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాను 2022లో రూ.63.63 కోట్లతో సమగ్ర తాగునీటి పథకం నిర్మాణానికి మున్సిపల్ కార్యాలయం ఎదుట అట్టహాసంగా డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యే అలజంగి జోగారావు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే ఇంతకుమించి వైసీపీ సర్కారు చేసిందేమీ లేదు. అప్పటి నుంచి పనులేవీ చేపట్టకపోవడంతో పట్టణవాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మొత్తంగా ఐదేళ్లలో వైసీపీ తాగునీటి సరఫరాపై ప్రత్యేకంగా దృష్టి సారించకపోవడంపై స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

---

## నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

- జూన్ 12న పునఃప్రారంభం

సాలూరు రూరల్/గరుగుబిల్లి/వీరఘట్టం, ఏప్రిల్ 23 : జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే వసతిగృహాలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో అవన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. కాగా సమ్మర్ రీడింగ్ కార్యక్రమంతో పాటు వేసవి పఠన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష పీడీ ఆదేశాలు జారీ చేశారు. వేసవి సెలవులను సద్వినియోగపర్చుకొనేలా అవసరమైన పర్యవేక్షణ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు పాఠశాలల్లో విధి విధానాల ఉత్తర్వులను ఆయా ఉపాధ్యాయులకు అందేలా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కార్యాచరణ ప్రణాళికలపై అవసరమైన ఆదేశాలు అందాయని, సంబంధిత ఎంఈవోలకు సమాచారం అందించామని జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ తెలిపారు.

## సీతంపేట ఐటీడీఏ పీవో బదిలీ

### నూతన పీవోగా శుభం బన్సాల్ నియామకం

పార్వతీపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి)/ సీతంపేట: పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారికి మంగళవారం ఆకస్మికంగా బదిలీ అయ్యింది. అయితే ఎక్కడ పోస్టింగ్ అనేది ఇంకా తెలియరాలేదు. జనరల్ అడ్మినిస్ట్రేట్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్టు చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేయడంతో ఆమె విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఇదిలా ఉండగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఐటీడీఏ పీవోగా జాయింట్ కలెక్టర్ శోభిక బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, డీడీ అన్నదొర, ఏపీవో రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఎన్నికల వేళ.. సీతంపేట ఐటీడీఏ పీవో, పాలకొండ నియోజకవర్గ ఆర్వోగా

- ఆకస్మిక స్థానచలనంపై సందేహాలెన్నో..

వ్యవహరిస్తున్న కల్పనాకుమారిని బదిలీ చేయడం వెనుక ఉన్న కారణాలేమిటనేది ఇంకా బహిర్గతం కాలేదు. దీనిపై అధికారులు కూడా ఎటువంటి ప్రకటన విడుదల చేయలేదు. ఈనెల 18న విడుదల చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించి ఫారం-1లో తప్పులున్నట్లుగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు వెళ్లినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే ఆమెను ఎన్నికల సంఘం బదిలీ చేసినట్టు తెలిసింది. అయితే దీనిపై కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదు.


కొత్తగా నియామకమైన ఐటీడీఏ పీవో శుభం బన్సాల్

పార్వతీపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పీవోగా శుభం బన్సాల్‌ను నియమిస్తూ మంగళవారం రాత్రి ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 24న విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్తగా నియామకమైన ఐటీడీఏ పీవో శుభం బన్సాల్ 2017లో టెక్నాలజీ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం 2019లో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గ్రేడ్-బీ మేనేజర్‌గా పనిచేశారు. 2019లో యూపీఎస్సీ పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో 43 ర్యాంకు సాధించారు. ఆయన గతంలో రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా, తిరుపతి జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు.

## మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

- డీఎంహెచ్‌వో జగన్నాథరావు

సాలూరు, ఏప్రిల్ 23: జిల్లాలో మాతాశిశు మరణాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో జగన్నాథరావు ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ భవనంలో ఏడు పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. మలేరియా జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్, డీఐవో నారాయణరావు, డీఎంవో జగన్మోహనరావు, డీఎస్‌వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల పర్వం

- పార్లమెంట్‌కు రెండు.. ● అసెంబ్లీకి ఎనిమిది..


కురుపాం: రెండో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందిస్తున్న టీడీపీ అభ్యర్థి జగదీశ్వరి

పార్వతీపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి)/ కురుపాం/ సాలూరు/ సీతంపేట: జిల్లాలో అరకు పార్లమెంట్ స్థానానికి గాను తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిగా జల్లి రాంబాబు, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా బి.చంటిబాబు మంగళవారం కలెక్టరేట్‌లో తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. పార్వతీపురం నియోజకవర్గానికి గాను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బత్తిన మోహనరావు, స్వతంత్ర అభ్యర్థిగా గర్భాపు మోహన్‌రావు ఆర్వో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి హేమలతకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. కురుపాంలో టీడీపీ అభ్యర్థిగా తోయక జగదీశ్వరి, స్వతంత్ర అభ్యర్థిగా నిమ్మక జయరాజు, సీపీఐ అభ్యర్థిగా మండంగి రమణ ఆర్వో వీవీ రమణకు నామినేషన్ల పత్రాలు అందించారు. పాల కొండ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా ఉల్లిభద్ర లక్ష్మి సీతంపేటలో జేసీ శోభికకు నామినేషన్ పత్రాలను అందించారు. సాలూరులో స్వతంత్ర అభ్యర్థులుగా కె.బంగారాజు, కె.మురళీ ఆర్వో సి.విష్ణుచరణ్‌కు తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇదిలా ఉండగా పాలకొండ నియోజకవర్గ జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ బుధవారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు. పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర గురువారం నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు.

## 'సిద్ధం' సభ అంటే ఇక్కట్లే మరి!

- జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులు
- మండుటెండలో ప్రయాణికుల అవస్థలు
- వైసీపీ నాయకులపై మండిపాటు

పార్వతీపురం టౌన్/పాలకొండ/సాలూరు, ఏప్రిల్ 23 : విజయనగరం మండలం చెల్లూరులో మంగళవారం నిర్వహించిన సిద్ధం సభకు జిల్లాలో మూడు ఆర్టీసీ డిపోల నుంచి భారీగా బస్సులను తరలించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండుటెండలో కాంప్లెక్స్‌ల వద్ద బస్సుల కోసం నిరీక్షించలేకపోయారు. మొత్తంగా గమ్యస్థానాలకు చేరుకు నేందుకు పడరాని పాట్లు పడ్డారు. వైసీపీ సిద్ధం సభకు పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి సుమారు 60 బస్సులు తరలించారు. దీంతో పాలకొండ, విజయ నగరం, బొబ్బిలి, సాలూరు, గుమ్మలక్ష్మీపురం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు నానా అవస్థలు పడ్డారు. పెళ్లిళ్ల, శుభకార్యాల సీజన్ కావడంతో అత్యధి కులు బస్సుల కోసం పడిగాపులు కాశారు. మరోవైపు పాఠశాలల ముగింపు రోజు కావడంతో తమ ఇళ్లకు వెళ్లేందుకు పయనమైన విద్యార్థులు సైతం ఇక్కట్లపాలయ్యారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, గ్రామీణ ప్రాంతవాసులు, చిన్నారులు, వృద్ధులు అధిక వేడి, ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఏదేమైనా తరచూ ఇలా ఆర్టీసీ బస్సు లను వైసీపీ సభలకు తరలించి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేయడం తగునా? అని వారు ప్రశ్నించారు.

- పాలకొండ ఆర్టీసీ డిపోలో ఉన్న 70 బస్సుల్లో 50బస్సులను సిద్ధం సభకు తరలించారు. రోజూ ఈ డిపో పరిధిలోని 70 బస్సులు ద్వారా 30 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కాగా మంగళవారం కేవ లం 20 శాతం బస్సులు మాత్రమే డిపో నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లడంతో ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేకపోయారు. దీంతో వారు వైసీపీ తీరుపై ధ్వజమెత్తారు.


పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

### నిరీక్షణ తప్పలేదు..

నేను ప్రైవేట్ జాబ్ చేస్తున్నాను. అయితే విజయనగరం వెళ్లేందుకు ఉదయం ఏడు గంటలకే సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నాను. తీరా చూస్తే ఇక్కడ బస్సులు లేవు. గంటల కొద్దీ నిరీక్షించినా ఫలితం లేదు.

- అప్పారావు, పనసలవలస, పాచిపెంట మండలం

### తీవ్ర ఇబ్బందులు

వైసీపీ సిద్ధం సభకు పార్వతీపురం ఆర్టీసీ డిపో బస్సులను మళ్లించి.. ప్రజను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. భార్యాపిల్లలతో బస్సుల కోసం ఎండలో నిరీక్షించలేకపోయాం.

- వి.శంకరరావు, గజపతినగరం, విజయనగరం జిల్లా

### మా బాధలు పట్టవా?

కొన్ని గంటల నుంచి పార్వతీపురం ఆర్టీసీ డిపోలో నిరీక్షిస్తున్నా.. పాలకొండ వెళ్లేందుకు ఒక్క బస్సు కూడా లేదు. ప్రైవేట్ వాహనాల్లో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం. సభలకు, సమావేశాలకు ఆర్టీసీ బస్సులే అవసరమా. మాలాంటి వారి బాధలు సీఎం జగన్‌కు పట్టవా?

- ఆదిలక్ష్మి, పనుకువలస, శ్రీకాకుళం జిల్లా

- సాలూరు ఆర్టీసీ డిపో నుంచి 35 బస్సులను సిద్ధం సభకు పంపించారు. మొత్తంగా డిపోలో 75 బస్సులు ఉండగా అందులో 10 అద్దె బస్సుల డ్రైవర్లకు జీతాలు చెల్లించకపోవడంతో వాటిని నిలుపుదల చేశారు. ఉన్న 65 బస్సుల్లో 35 బస్సులను సిద్ధం సభకు పంపించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ.. ముందుగా డబ్బులు చెల్లిస్తేనే 35 బస్సుల ను పంపించామన్నారు. చాలా రూట్లలో బస్సులను తగ్గించి సిద్ధం సభకు తరలించామని చెప్పారు.


సాలూరులో..


పాలకొండలో..

పీపుల్స్ మేనిఫెస్టో

## రైతులను ఆదుకోవాలి



సాలూరు రూరల్: ఎన్నికల్లో రైతులకు ఆశ చూపిస్తారు. ఎన్నికలు ముగిసిన తరువాత అన్నదాతకు చుక్కలు చూపించడం పరిపాటిగా మారింది. రైతు ప్రభుత్వంగా చెప్పుకొని విస్మరించడం తగదు. రైతులకు అన్ని విధాలుగా మేలు చేయాలి. భవిష్యత్‌లో ఆహార సంక్షోభం రాకుండా ఉండాలంటే రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- బూస తవుడు, రైతు, మామిడిపల్లి

## సిరా గుర్తు వేసేందుకు చూపుడు వేలు లేకపోతే..!

మీకు తెలుసా

కొమరాడ: సాధారణంగా ఓటు వేసే వారికి పోలింగ్ కేంద్రంలో సిబ్బంది ఎడమ చేతి చూపుడు వేలికి సిరా గుర్తు వేస్తారు. రెండోసారి ఓటేయడానికి రాకుండా ఉండేందుకు ఇలా చేస్తారని అందరికీ తెలిసిన విషయమే. మరి ఆ వేలు లేని వారి పరిస్థితి ఏమిటంటే చాలా మందికి తెలియదు. ఎడమ చేయి చూపుడు వేలు లేని ఓటర్ల విషయంలో భారత ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. ఎడమ చేయి చూపుడు వేలు లేకపోతే మధ్య వేలికి సిరా గుర్తు వేయవచ్చు. అది కూడా లేకపోతే మధ్య వేలికి, అదీ లేకపోతే ఉంగరం వేలికి, అదీ లేకపోతే చిటికెన వేలికి, చివరకు నాలుగు వేళ్లు లేకపోతే బొటన వేలికి సిరా గుర్తు పెడతారు. ఇదే క్రమంలో సిరా గుర్తు వేస్తారు. రెండు చేతులకు వేళ్లు లేకపోతే ఎలా అంటే? వేళ్ల మొదలు... లేదా మధ్య భాగం లేదా చేతిపై గుర్తువేస్తారు. భుజాల వరకు చేతులు లేని ఓటర్లకు ఎడమ చెంపపై సిరా గుర్తు పెడతారు.

## ఎవరికి ఓటు వేశామో తెలుసుకోవచ్చు..



కొమరాడ: ఈవీఎంలో మనం ఎవరికి ఓటు వేశామో చూసుకోవచ్చు. నచ్చిన అభ్యర్థికి... పార్టీకి వేసిన ఓటు సక్రమమేనా లేక క్రాస్ అయిందా అనే అనుమానాన్ని నివృత్తి చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఓటరు వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్) ద్వారా కల్పిస్తోంది. వేసిన ఓటును చూసుకునే అవకాశం ఏడు సెకన్ల వరకు మాత్రమే ఉంటుంది. అనంతరం ఆ ఓటు వీవీ ప్యాడ్ బాక్స్‌లో పడిపోతుంది. ఈ విధానాన్ని తొలిసారిగా 2013 సెప్టెంబరులో నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో 10 నియోజకవర్గాలలో అమలు చేశారు. ఆ తరువాత దశల వారీగా అంతటా అమల్లోకి వచ్చింది. వేసిన ఓటును సెల్‌ఫోన్ ద్వారా చిత్రీకరించడం... బహిర్గతం చేయడం మాత్రం నిషేధం. ఉల్లంఘిస్తే ఓటు రద్దుతో పాటు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది.



పార్వతీపురం మన్యం జిల్లా రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అడుగుకో గొయ్యి ఏర్పడడంతో వాహన చోదకులు...ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం రహదారుల మరమ్మతులను పూర్తిగా విస్మరించడంతో అధ్వానంగా తయారయ్యాయి. వాహనాల రాకపోకలకే కాదు... కనీసం నడవడానికి కూడా వీలులేని పరిస్థితి.

# ఇవి రోడ్లంటారా?



గరుగుబిల్లి: పెద్దూరు సమీపంలో పాడైపోయిన రోడ్డు

- అధ్వానంగా రహదారులు
- అవస్థలు పడుతున్న మన్యం జిల్లా ప్రజలు
- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

(పార్వతీపురం రూరల్)

వైసీపీ పాలనలో రహదారులు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలంటే పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటిస్తే చాలు. ఎక్కడికక్కడ రాళ్లు తేలి...గోతులతో దారుణంగా కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రం పార్వతీపురం సమీపంలో ఉన్న వెంకంపేట గోలీలు వద్ద రోడ్లపై గుంతలు ఏర్పడి రాకపోకలకు ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. వెంకంపేట గోలీల నుంచి ఒడిశా సరిహద్దు వరకు వెళుతున్న రహదారి అనేక ప్రాంతాల్లో గోతులమయమైంది. వెంకంపేట రామందిరం వద్ద రహదారి పరిస్థితి చూస్తుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. చిన్నబొండపల్లి గ్రామ శివారు ప్రాంతంలో బ్రిడ్జి వద్ద రహదారి పూర్తిగా పాడైపోయింది. ఎంఆర్ నగరం గ్రామ ప్రవేశ ద్వారం వద్ద రహదారి పరిస్థితి దారుణంగా ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లు శిథిలావస్థలోనే కనిపిస్తున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో రహదారులను పూర్తిగా విస్మరించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయినా ఈ రోడ్డును పట్టించుకోకపోవడంపై సర్వత్రా మండిపడుతున్నారు.



వెంకమ్మపేట జంక్షన్ వద్ద రహదారి దుస్థితి

### వెళ్లలేకపోతున్నాం

వెంకంపేట గోలీల నుంచి ఆర్‌అండ్‌బీ రహదారిపై ప్రయాణం చేయాలంటే నరకమే కనబడుతుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారులను పట్టించుకోపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది.

- కె.శ్రీనివాసరావు, పార్వతీపురం

### ఇబ్బంది పడుతున్నారు..

రహదారులు గోతుల మయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఎన్ని సమస్యలు ఎదుర్కొంటున్నా పాలకులు పట్టించుకొనే పరిస్థితి నియోజకవర్గంలో కనిపించడం లేదు. చిన్నబండపల్లి ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది.

- అప్పలనాయుడు, పార్వతీపురం మండలం

### ఒడిశా రహదారులే నయం

వెంకంపేట గోలీల నుంచి ఆంధ్రా సరిహద్దు ప్రాంతం వరకు రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. ఆంధ్రా సరిహద్దు నుంచి ఒడిశా రోడ్లు చాలా బాగున్నాయి. మన రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని పట్టించుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొంది.

- ఆర్.అనిల్, పార్వతీపురం మండలం

## అడుగుకో గొయ్యి

గరుగుబిల్లి: మండల కేంద్రం గరుగుబిల్లి నుంచి బీవీ పురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. గరుగుబిల్లి నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల మేర అడుగడుగునా గోతులే దర్శనమిస్తున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన రహదారికి ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో నిత్యం ఈ మార్గంలో ప్రయాణించేవారు నరకయాతన అనుభవిస్తున్నారు. పెద్దూరు చెరువుకు ఆనుకుని ఉన్న రహదారి అత్యంత దారుణంగా తయారైంది. ఏ మాత్రం అదుపు తప్పినా ఒకవైపు చెరువు, మరోవైపు లోతైన పంట పొలాలు ఉన్నాయి. ఈ మార్గంలో చీకటి పడిందంటే తిప్పలు తప్పవు. రహదారి సమస్యపై పలు దఫాలు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం గుండా బలిజిపేట, సీతానగరం మండలాలతో పాటు వివిధ గ్రామాల వారు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి...అధికారంలోకి వచ్చిన తరవాత సమస్యలను విస్మరించడం కురుపాం నియోజకవర్గంలో ఆనవాయితీగా మారిందని అధికార పార్టీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చిలకాం, శివ్వాం, కొత్తూరు, రావుపల్లి, సన్యాసిరాజుపేట, కొంకడివరం, రావివలస, నాగూరుతో పాటు వివిధ గ్రామాల రహదారులు దయనీయంగా దర్శనమిస్తున్నాయి.





భామిని: రాళ్లు తేలిన యాతంగూడ, మూలగూడ రహదారులు

### ఆదివాసీలకు కష్టాలు

భామిని: మండలంలోని తివ్వకొండపైన గ్రామాలు, దిగువున ఉన్న గ్రామాలకు పక్కా రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ అధికారులు, గిరిజనుల కోరిక మేరకు ఏవి కావాలన్నా అమలు చేస్తామని వాగ్దానాలే తప్ప ఆచరణ కనిపించడం లేదు. ఈ నాలుగేళ్లలో లింకు రోడ్లు నిర్మించి అర్థాంతరంగా నిలిపివేయడంతో కాలినడకన వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఏబీ రోడ్డు లివిరి నుంచి మూలగూడ వరకు సుమారు మూడు కిలోమీటర్ల రహదారి పూర్తిగా రాళ్లు తేలిపోయింది. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. బొడ్డగూడ రోడ్డు నుంచి యాతంగూడ, సన్నాయికాలనీ రహదారులకు మెటల్స్, చిప్స్ వేసి వదిలిపెట్టారు. బురుజోల పంచాయతీ మండ్రుంగూడ, కొత్తగూడ, వడ్డంగి పంచాయతీ జియ్యమానుగూడ రహదారి కూడా అధ్వానంగా మారింది. చిప్స్, మెటల్ వేసి విడిచిపెట్టడంతో గేదెలగూడ, డోకులగూడ, యాతంగూడ గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొండ శిఖరాన ఉన్న కోటకొండ, కోసింగూడ గ్రామాలకు కోసిమానుగూడ నుంచి రోడ్డు వేయడానికి ఎర్త్ వర్క్ చేసి విడిచిపెట్టడంతో ఆ రోడ్డు వర్షాల వల్ల కూరుకుపోయి రాళ్లు తేలి నడిచేందుకు వీలు లేకుండాపోయింది. గిరిజనులకు అనారోగ్య సమస్యలు ఏర్పడితే ఆసుపత్రులకు వచ్చేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

## బి.ఫారం అందుకున్న బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ స్థానానికి ఎన్డీఏ కూటమి తరపునఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) మంగళవారం తమ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నుంచి పార్టీ బి.ఫారం అందుకున్నారు. ప్రజాగళం సభలో పాల్గొనేందుకు గజపతినగరం విచ్చేసిన చంద్రబాబును బేబీనాయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన ఆశీర్వాదంతో పాటు బి.ఫారం కూడా అందుకున్నారు. ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, బాడంగి మండల టీడీపీ సీనియర్ నాయకుడు ఆవు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు నుంచి బీ ఫారం అందుకుంటున్న బేబీనాయన

పెద్దల మాట

## నాడు సామాన్యులకు పదవులు.. నేడు ధనవంతులకే అవకాశం

శృంగవరపుకోట రూరల్: మేం యుక్త వయసులో ఉన్నపుడు సామన్యులకు పదవులు వచ్చేవి. ప్రస్తుత పరిస్థితుల్లో డబ్బులు ఉన్న వారికే అధికారం అందుతోంది. నాటి ఎన్నికల సమయంలో వచ్చే నాయకులు తమకు ఓటు వేయాల్సిందిగా కోరేవారు. అభ్యర్థి మంచివారైతే మేమే రూపాయి నుంచి రూ.ఐద వరకు సాయంగా ఇచ్చేవాళ్లం. నేడు ఓటు అమ్ముకునే దుస్థితికి చాలా మంది వచ్చారు. నాడు ఆరోగ్యవంతమైన రాజకీయం..నేడు అంతా అస్తవ్యస్తం. అప్పుడు రంగుల కాగితాలు ఇస్తే మాకు నచ్చిన అభ్యర్థికి అట్ట పెట్టెల్లో వేసేవాళ్లం. మంచి అభ్యర్థి అయితే ఆయన తరపున మేమే స్వచ్ఛందంగా ప్రచారం చేసేవాళ్లం. 1994లో మండల వ్యవస్థ ఏర్పడిన తరువాత నన్ను జడ్పీటీసీగా పోటీ చేయించి... గెలిపించారు. ఇప్పుడు అలాంటి రోజులు లేవు. 1951లో మా ధర్మవరం గ్రామానికి ఎంతో నిరాడంబరంగా అప్పటి వ్యవసాయశాఖ మంత్రి ఎన్‌జీ రంగా వచ్చి మొట్టమొదటిగా వీధి దీపాలు ప్రారంభించిన రోజు ఇంకా గుర్తుంది. ఆ హుందాతనం నేడు ఎవరికీ లేదు.

- అల్లు సూర్యనారాయణమ్మ (84)
మాజీ జడ్పీటీసీ, ధర్మవరం



## కాంగ్రెస్ అభ్యర్థికి విమానం గుర్తు!

- 1985 ఎన్నికల్లో వింత సంఘటన

ఎన్నెన్నో



మీసాల నీలకంఠంనాయుడు

చీపురుపల్లి: భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ హస్తం గుర్తును కేటాయిస్తుంది. పార్లమెంటుకు, లేదా రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలకు గానీ ఆ పార్టీ తరపున పోటీ చేసే వారిది హస్తం గుర్తే. కానీ దీనికి భిన్నంగా చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1985లో కాంగ్రెస్ తరపున ఎన్నికల్లో నిలిచిన అప్పటి అభ్యర్థి మీసాల నీలకంఠంనా యుడుకు ఒక వింత అనుభవం ఎదురైంది. జాతీయ కాంగ్రెస్ తరపున బరిలో ఉన్న ఆయనకు హస్తం గుర్తుకు బదులుగా విమానం గుర్తుపై పోటీ చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. 1985లో తెలుగుదేశం పార్టీలో తలెత్తిన సంక్షోభం కారణంగా అప్పటి సీఎం ఎన్టీఆర్ పక్కకు తప్పుకోవలసి వచ్చింది. 1983లో ఏర్పాటైన అసెంబ్లీని రద్దు చేసి, మధ్యంతర ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున కెంబూరి రామ్మోహనరావు పోటీకి నిలబడ్డారు. ఆయనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ తరపున మీసాల నీలకంఠంనాయుడు పోటీకి దిగారు. అప్పట్లో పార్టీలో నెలకొన్న అంతర్గత కారణాల వల్ల నీలకంఠం నాయుడుకు టికెట్ కేటాయించడంలో కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడింది. ఆఖరి నిమిషంలో ఆయనకు బీ ఫారం పంపించింది. అయినప్పటికీ కాంగ్రెస్ తరపున నీలకంఠంనాయుడు సకాలంలో బీ ఫారం అందించలేకపోయారు. గడువు లోపల ఆయన పార్టీ బీ ఫారం ఆర్వోకు సమర్పించలేకపోవడంతో చివరి నిమిషంలో ఆయనను స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తూ ఎన్నికల కమిషన్ విమానం గుర్తు కేటాయించింది. ఆయన నూటికి నూరుపాళ్లు కాంగ్రెస్ అభ్యర్థి అయినప్పటికీ, ఆ పార్టీ తరపున ప్రచారం చేసుకొనే అవకాశం దక్కలేదు. దీంతో విధి లేని పరిస్థితుల్లో ఆయన తాను ఏర్పాటు చేయించిన క్లాత్ బ్యానర్లపై తన పేరుకు ఒక వైపున హస్తం గుర్తు, మరోవైపున విమానం గుర్తు ముద్రించి ప్రచారం చేసుకోవలసి వచ్చింది. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి కెంబూరి రామ్మోహనరావుకు 45,349 కోట్లు పోలవ్వగా... నీలకంఠంనాయుడుకు కేవలం 13,052 ఓట్లు మాత్రమే వచ్చాయి.

సెంటిమెంట్

## అక్కడ బాబు సభ పెడితే... విజయమే!



సోమవారం రాత్రి దేవిబొమ్మ కూడలిలో ప్రజాగళం సభ

శృంగవరపుకోట: శృంగవరపుకోట దేవి బొమ్మ కూడలి వద్ద టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారం చేసిన ప్రతిసారీ ఆ పార్టీ అభ్యర్థి గెలుస్తారన్న సెంటిమెంటు ఉంది. 2009, 2014 సార్వత్రిక ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి కోసం ఇక్కడే ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో విజయం సాధించారని చెబుతున్నారు. సోమవారం కూడా ఇక్కడే ప్రజాగళం సభ నిర్వహించడంతో ఈ దఫా తప్పక గెలుస్తారని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు.

## టీడీపీ తరపున మాజీ సైనికుడి ప్రచారం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా విజయవాడకు చెందిన మాజీ సైనికుడు ఎం.శంకరరావు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ అభ్యర్థులకు తన మద్దతు తెలియజేస్తూ పత్రాలు అందజేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజలను మాజీ సైనికుడు కలుస్తూ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమని చెబుతున్నారు. టీడీపీ, జనసేన, ఉమ్మడి అభ్యర్థి విజయచంద్రను మంగళవారం కలిసి మద్దతు తెలిపే పత్రాన్ని శంకరరావు అందించారు.



కూటమి అభ్యర్థి విజయచంద్రకు పత్రాలను అందిస్తున్న శంకరరావు

జన కేతనం
ఆంధ్రజ్యోతి బుధవారం 24 ఏప్రిల్ 2024

## పోలింగ్ కేంద్రాలు మూడు రకాలు

**కొమరాడ:** ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలను మూడు రకాలుగా విభజించారు. ఇందులో సాధారణ పోలింగ్ కేంద్రం.. రెండోది సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రం... మూడోది అతి సున్నితమైన పోలింగ్ కేంద్రం. రాజకీయ నాయకుల అనుచరులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్, గొడవలు, ఇతరేతర సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈ విధమైన విభజన జరిగింది. సాధారణ పోలింగ్ కేంద్రం కంటే అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఎక్కువగా ఉంటుంది. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఇలాంటి వాటిని ఇప్పటికే గుర్తించి జియో ట్యాగింగ్ చేసి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసి ఉంటారు. వీటి ఆధారంగా ఎన్నికల అధికారులు పర్యవేక్షిస్తుంటారు.

# గిరిజన బాంధవుడు.. ఎన్టీఆర్



పాలకొండ నియోజకవర్గ ముఖచిత్రం

- ఐటీడీఏలతో ఎంతో మేలు
- ఏజెన్సీ ముఖద్వారం పాలకొండ నియోజకవర్గం
- 80 శాతానికి పైగా వ్యవసాయ ఆధారిత కుటుంబాలే
- టీడీపీ వైపు పల్లెల చూపు

**ఎక్కడో విసిరేసినట్టు ఉండే పల్లెలు...నాగరిక ప్రపంచానికి దూరంగా జనం. అటవీ ఉత్పత్తులపై వచ్చే అరకొర ఆదాయం. దళారుల చేతిలో మోసపోవడం..ఇదీ కొన్ని దశాబ్దాల కిందట అమాయక గిరిజనుల జీవనచిత్రం. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక వీరి జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయి. ఐటీడీఏలకు రూపకల్పనతో గిరిజనుల జీవన చిత్రాన్ని సమూలంగా మార్చేశారు. ఇప్పుడు ఐటీడీఏల ద్వారా వారికి అందుతున్న ఫలాలు ఎన్టీఆర్ చలువే. పాలకొండ నియోజకవర్గంలో అత్యధిక శాతం గిరిజనులు నిరంతరం ఎన్టీఆర్‌ను తలచుకుంటూనే ఉంటారు.**

(పాలకొండ)

పాలకొండ నియోజకవర్గం ఏజెన్సీకి ముఖద్వారం. అటు ఏజెన్సీ ప్రాంతం, ఇటు మైదాన ప్రాంతం కలబోసి పాలకొండ నియోజకవర్గం. 1952లో ఈ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. అప్పటి నుంచి వివిధ పార్టీల అభ్యర్థులు ప్రాతినిధ్యం వహించారు. ఈ నియోజకవర్గ పరిధిలో సీతంపేట, వీరఘట్టం, పాలకొండ, భామిని మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో ఇప్పటికీ 80 శాతం వ్యవసాయ ఆధారిత కుటుంబాలే. సీతంపేట ఏజెన్సీలోని గిరిజనులు అటవీ ప్రాంతంలో వివిధ రకాల అటవీ ఉత్పత్తులను సేకరించి.. అమ్మకాలు చేయడంతో పాటు వాణిజ్య పంటలపై ఇప్పుడిప్పుడే దృష్టి సారిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో ప్రజానీకం వంశధార, నాగావళి నదుల మధ్య ఉండడంతో ఆ నదుల నీటితో పాటు కొండ వాగులు, గెడ్డల ద్వారా వచ్చే నీటితో పంటలను పండించి జీవనాధారం పొందుతున్నారు. నాగావళి, వంశధార నదులు చెంతనే ఉన్నప్పటికీ పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు పూర్తిస్థాయిలో సాగునీరు, తాగునీరు అందుతున్న దాఖలాలు లేవు. పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం ప్రస్తుత అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉంది. ఇప్పటి వరకు శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉన్న ఈ నియోజకవర్గం ఇటీవల జిల్లాల పునర్విభజనలో పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోకి వెళ్లింది. పాలకొండ నియోజకవర్గ కేంద్రం తొలినాళ్లలో పంచాయతీగా ఉండేది. ఆ తర్వాత మేజర్ పంచాయతీగా.. ప్రస్తుతం నగర పంచాయతీగా కొనసాగుతోంది. డివిజన్ కేంద్రంగా ఉన్నప్పటికీ ఆ స్థాయిలో సదుపాయాలు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని.. దీని వల్లనే పునర్విభజనలో పాలకొండ జిల్లా కేంద్రంగా రూపుదిద్దుకోలేకపోయిందని నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాలకొండ పట్టణం

### 1952 నుంచి ఇలా..

1952లో పాలవసల సంగంనాయుడు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థి ఏఆర్ నాయుడుపై గెలుపొందారు. 1955లో పైడి నర్సింహ అప్పారావు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి.. మరో ఇండిపెండెంట్ అభ్యర్థి కేఎస్ నాయుడుపై విజయం సాధించారు. 1962లో కేఎస్ నాయుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పైడి ఎ నర్సింహ అప్పారావుపై గెలిచారు. 1967లో జె.జోజి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి.. కాంగ్రెస్ అభ్యర్థి కె.నరసయ్యపై గెలుపొందారు. 1972లో కె.నరసయ్య కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి.. ఇండిపెండెంట్ అభ్యర్థి జమ్మయ్యపై విజయం సాధించారు. 1978లో జనతా పార్టీ నుంచి కె.రాజరత్నం పోటీ చేసి.. కాంగ్రెస్(ఐ) అభ్యర్థి డి.ఆదినారాయణపై గెలుపొందారు. 1983లో టీడీపీ అభ్యర్థి శ్యామరావు... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జె.లచ్చయ్యపై విజయం సాధించారు. 1985లో టీడీపీ నుంచి తలే భద్రయ్య పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పీజే అమృతకుమారిపై గెలుపొందారు. 1989లో కాంగ్రెస్(ఐ) తరఫున పోటీ చేసిన పీజే అమృతకుమారి... టీడీపీ అభ్యర్థి జి.సత్తెయ్యపై గెలుపొందారు. 1994లో టీడీపీ అభ్యర్థి తలే భద్రయ్య.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పీజే అమృతకుమారిపై గెలిచారు. 1999లో ఇండిపెండింట్ అభ్యర్థిగా పోటీ చేసిన పీజే అమృతకుమారి... టీడీపీ తరఫున పోటీ చేసిన తలే భద్రయ్యపై విజయం సాధించారు. 2004లో టీడీపీ అభ్యర్థి కంబాల జోగులు కాంగ్రెస్ అభ్యర్థి టి.రాంబాబుపై గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి నిమ్మక సుగ్రీవులు టీడీపీ అభ్యర్థి నిమ్మక గోపాలరావుపై గెలుపొందారు. 2014 వైసీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి టీడీపీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణపై గెలుపొందారు. 2019లో వైసీపీ తరఫున పోటీ చేసిన విశ్వాసరాయి కళావతి టీడీపీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణపై గెలుపొందారు.



సంగంనాయుడు



నరసింహ అప్పారావు



తలే భద్రయ్య



కంబాల జోగులు



నిమ్మక సుగ్రీవులు



పీజే అమృతకుమారి




విశ్వాసరాయి కళావతి

**పాలకొండ అసెంబ్లీ ఎమ్మెల్యేలు వీరే..**

| | | |
|---|---|---|
| 1952 | పాలవలస సంగంనాయుడు | కాంగ్రెస్ |
| 1955 | పైడి నరసింహ అప్పారావు | ఇండిపెండెంట్ |
| 1962 | కేఎస్ నాయుడు | ఇండిపెండెంట్ |
| 1967 | జె.జోజి | ఇండింపెండెంట్ |
| 1972 | కె.నరసయ్య | కాంగ్రెస్ |
| 1978 | కె.రాజారత్నం | జనతా |
| 1983 | శ్యామలరావు | టీడీపీ |
| 1985 | తలే భద్రయ్య | టీడీపీ |
| 1989 | టీజే అమృతకుమారి | కాంగ్రెస్ (ఐ) |
| 1994 | తలే భద్రయ్య | టీడీపీ |
| 1999 | టీజే అమృతకుమారి | ఇండిపెండెంట్ |
| 2004 | కంబాల జోగులు | టీడీపీ |
| 2009 | నిమ్మక సుగ్రీవులు | కాంగ్రెస్ |
| 2014 | విశ్వసరాయి కళావతి | వైసీపీ |
| 2019 | విశ్వసరాయి కళావతి | వైసీపీ |

**ఓటర్లు ఇలా..**

| | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 1,93,667 |
| పురుషులు | 94,328 |
| మహిళలు | 99,325 |
| ఇతరులు | 14 |
| పోలింగ్ బూత్‌ల సంఖ్య | 287 |



### జనరల్ నుంచి ఎస్టీ నియోజకవర్గంగా...

1952లో ఏర్పడిన పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం తొలినాళ్లలో 1952 నుంచి 1955-62 వరకు మూడు సార్లు జనరల్‌గా ఉండేది. 1967లో పునర్విభజనలో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా మరింది. అప్పటి నుంచి 2004 వరకు ఎస్సీ నియోజకవర్గంగా కొనసాగింది. 2009 పునర్వభజనలో ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంగా మారింది. అప్పటి నుంచి 2014, 2019.. ప్రస్తుత ఎన్నికల్లో ఎస్టీ రిజర్వుడుగానే కొనసాగుతోంది.

### ఐటీడీఏతో గిరిజనుల్లో చైతన్యం

తెలుగుజాతి గర్వించదగ్గ మహానాయకుడు, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు.. దివంగత నందమూరి తారకరామారావు అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజనాభివృద్ధికి పెద్దపీట వేశారు. దీనిలో భాగంగానే 1983లో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా ఉన్న శంకరన్ ఆధ్వర్యంలో ఐటీడీఏలను ప్రారంభించారు. ఐటీడీఏ అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి గిరిజన ప్రజలు చైతన్యవంతులై హక్కులను పొందారు. అప్పటి నుంచి ప్రత్యేక నిధులు కేటాయించడంతో అమాయక గిరిజనులు అన్నిరంగాల్లో రాణించి పోటీ ప్రపంచంలో పరుగులు పెడుతున్నారు. ఇదంతా ఎన్టీఆర్ కృషి ఫలితమే.



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం



వేదికపై చంద్రబాబుతోపాటు కూటమి అభ్యర్థులు, నాయకులు

# బాబును చూడాలని..!


- బారులు తీరిన జనం
- ఎండను లెక్క చేయకుండా ఎదురుచూపులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/బొండపల్లి, ఏప్రిల్ 23: 'ప్రజాగళం' యాత్రకు వచ్చిన చంద్రబాబును చూసేందుకు బొండపల్లి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో వేదిక వద్దకు చేరుకున్నారు. నిర్వాహకులు ఊహించిన సంఖ్య కంటే చాలా ఎక్కువగా మహిళలు సభాప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో చాలా మంది బయట ఉండాల్సి వచ్చింది. 43 డిగ్రీల ఎండను సైతం లెక్కచేయకుండా చంద్రబాబును చూసేందుకు ఆసక్తి చూపారు.



సెల్ఫీ తీసుకుంటున్న యువతి

- సభ జాతీయ రహదారి 23ని ఆనుకుని ఏర్పాటు చేశారు. చంద్రబాబు కాన్వాయ్ వచ్చే సమయానికి భారీగా ట్రాఫిక్ స్తంభించింది.
- మహిళలు కేరింతలు కొట్టడం కనిపించింది. టీడీపీ, బీజేపీ, జనసేన గీతాలకు డ్యాన్సులు చేశారు.
- ఎండ వేడిని తట్టుకునేలా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఎయిర్ కూలర్లు, ఫ్యాన్‌లు పెట్టారు. మజ్జిగ, మంచినీరు ఇచ్చి మహిళలు, జనం దాహార్తిని తీర్చారు.
- టిక్కెట్‌లు రాకపోవటంతో కొద్ది రోజులుగా పార్టీకి దూరంగా ఉన్న కిమిడి నాగార్జున, కేఏనాయుడు చంద్రబాబుతో మాట్లాడాక జోష్ తో కనిపించారు.
- వేదికపై కేఏ నాయుడు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు మినహా ఇప్పటివరకు నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు.
- జనసేన నాయకుడు ముర్రాపు సురేష్ మాట్లాడుతూ కూటమి గెలుపు.. అభివృద్ధికి మలుపని, మహిళలు ఆర్థికాభివృద్ధి చెందా లంటే కూటమి అభ్యర్థులు విజయం సాధించాలన్నారు.



అశోక్, బేబీనాయన మాటామంతీ..

**నా ఆశయాన్ని నెరవేర్చండి**

'నేను ఇప్పటివరకు విద్యార్థిగా కష్టపడి చదివాను. వైద్య వృత్తిలో స్థిరపడాలని నా ఆశయం, నా తల్లిదండ్రుల కలను మీరే సాకారం చేయాల'ంటూ విద్యార్థిని షర్మిలా గాయత్రి సభలో చంద్రబాబును కోరారు.

**విద్యకు సహకరించాలి**

విద్యా దీవెనను ఇద్దరు పిల్లలకే పరిమితం చేయకుండా ఎందరున్నా సహకారం అందించాలని పురిటిపెంట గ్రామానికి చెందిన తోండ్రోతు రమాదేవి సభలో చంద్రబాబును కోరారు. ఎంతమంది పిల్లలున్నా విద్యాభివృద్ధికి రూ.15వేల వంతున సహకారం అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

**చంద్రన్న బీమాతో ఆసరా**

మీ పాలనలో చంద్రన్న బీమా ద్వారా రూ.2 లక్షల లబ్ధి పొందాను. మీకు ధన్యవాదాలు తెలిపేందుకే ఇక్కడకు వచ్చానని ముచ్చర్ల గ్రామా నికి చెందిన హైమావతి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



కదిలింది మహిళా లోకం..



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రధాని మోదీ మాస్క్‌తో..



సూపర్ సిక్స్ పథకాల కార్డులతో మహిళలు

## తాగునీటి సమస్యను పరిష్కరించండి

● ఏవోబీలో జాకరవలస గిరిజనుల ఆందోళన



ఆందోళన చేస్తున్న జాకరవలస గిరిజనులు

**సాలూరు రూరల్:** తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఏవోబీలోని జాకరవలసకు చెందిన గిరిజనులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నేతలు మర్రి శ్రీనివాసరావు, మెల్లిక అయోధ్య ఆధ్వర్యంలో వారు ధర్నా చేపట్టారు. తమ గ్రామానికి తాగునీటి ట్యాంకులు ఉన్నా పనిచేయడం లేదని వాపోయారు. అధికారులు పట్టించుకోవడం లేదని, రాజకీయ నేతలు ఎన్నికల హడావుడిలో తమ సమస్య వినే పరిస్థితి లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం సమీపంలో ఉన్న సువర్ణముఖి నది నుంచి చలమలను ఆశ్రయిస్తున్నామని చెప్పారు. తాగునీటి సమస్యను పరిష్కరించకుంటే మండల కేంద్రంలో ర్యాలీ, ధర్నా చేయాల్సి వస్తుందని సీపీఎం నేతలు అల్టిమేటమిచ్చారు.

## నవధాన్యాల సాగుతో నేల సారవంతం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకాష్

**జియ్యమ్మవలస:** నవధాన్యాలు సాగు చేయడం వల్ల నేల సారవంతం అవుతుందని రిజనల్ థిమెటిక్ లీడ్ (ఆర్‌టీఎల్) అధ్యక్షుడు కె.ప్రకాష్ అన్నారు. మంగళవారం గవరమ్మపేట గ్రామంలో ఆయన నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతూ తప్పనిసరిగా 20 నుంచి 30 రకాల విత్తనాలను నవధాన్యాలుగా వేసుకోవడం వల్ల ఇంటి అవసరాలు తీర్చుకోవడమే కాకుండా పశువుల దాణాకు కూడా ఉపయోగపడుతుందన్నారు. అలాగే భూమి సారవంతమవుతుందని, ప్రధాన పంటకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా లభించడం వల్ల పంటలు దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్, ఎన్జీవో ప్రతినిధి దేవుళ్లు, జిల్లా డీపీఎం పి.షణ్ముఖరాజు, ఎన్ఎఫ్‌జే జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జి ధనుంజయరావు, రైతులు పాల్గొన్నారు.

## సహజ వనరులపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

**సీతంపేట:** సహజ వనరుల వినియోగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుశాంత్ జన అన్నారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూతాపాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి.ప్రభాకర్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ రవికిరణ్‌కుమార్, జేకేసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఫణికుమారి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు మంజుల పాల్గొన్నారు.

## గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

**సీతంపేట:** స్థానిక గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు గురుకుల పాఠశాల నోడల్ ప్రిన్సిపాల్ నాగభూషణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట బాలికల గురుకుల కళాశాల, బాలుర గురుకుల కళాశాల ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో గిరిజన, గిరిజనేతర అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఈనెల 24 నుంచి ఏ ప్రిల్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇతర వివరాలకు గురుకుల కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలన్నారు.

## సాలూరులో వర్షం



సాలూరులో వర్షం పడిన దృశ్యం

**సాలూరు రూరల్:** సాలూరులో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉంది. సాలూరు అర్బన్, రూరల్ మండలాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. దీంతో జనం సేదతీరారు.

## ఘనంగా వ్యాపారమ్మ తల్లి ఉత్సవం



అమ్మవారి ఘటాలను సిద్ధం చేసిన దృశ్యం

**కొమరాడ:** కళ్లికోట గ్రామదేవత వ్యాపారమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి సిరిమానోత్సవం నిర్వహించారు. గ్రామస్థులతో పాటు సమీప ప్రాంత ప్రజలు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం అనుపోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొమరాడ ఎస్ఐ నీలకంఠం ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.

## జీడి తోట దగ్ధం

● ఘటనా స్థలానికి చేరుకోని అగ్నిమాపక సిబ్బంది

● సుమారు రూ.3లక్షల ఆస్తి నష్టం

**శృంగవరపుకోట రూరల్:** బొడ్డవర పంచాయతీ లచ్చందొరపాలెం సమీపంలో సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జీడితోట అగ్నికి ఆహుతయ్యింది. మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు లచ్చందొరపాలెం సమీపంలో ఉన్న జీడితోటకు నిప్పు అంటుకుంది. దీంతో చుట్టుపక్కల ఏడుగురు రైతులకు చెందిన తోటలకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదని, దీంతో జీడిపంటను కోల్పోయామని బాధితులు గేదెల బొంగారయ్య, గేదెల చందు, బుదరయ్య, గేదెల రామారావు తదితరులు వాపోయారు. ఈ ప్రమాదం వల్ల సుమారు రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగిందని గిరిజన యువత చెబుతున్నారు.

**వేపాడ వెళ్లాం**

ఈ విషయంపై ఎస్.కోట అగ్నిమాపకశాఖ అధికారి మదీనాను వివరణ కోరగా, ఫోన్ వచ్చిన సమయంలో తాము వేపాడ మండలంలో అగ్నిప్రమాదం నివారణకు వెళ్లామని చెప్పారు. అయితే కొత్తవలస సిబ్బందికి సమాచారం ఇచ్చినా వారు అందుబాటులో లేరని తెలిపారు.



జీడి తోటలో మంటలు వ్యాపిస్తున్న దృశ్యం

# 'ఉపాధి'కి వసతి సమస్య

● పూర్తిస్థాయిలో కార్యాలయం లేని వైనం

● ఇబ్బంది పడుతున్న సిబ్బంది ● రికార్డుల నిర్వహణకు ఆటంకం



ఎంపీడీవో కార్యాలయం బయట విధులు నిర్వహిస్తున్న ఉపాధి సిబ్బంది(ఫైల్)

**గరుగుబిల్లి:** మండలానికి సంబంధించి ఉపాధి సిబ్బందికి పూర్తిస్థాయిలో కార్యాలయం లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పథకం ప్రారంభం నుంచి మండల పరిషత్ కార్యాలయంలోని కొంత భాగంలో కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం పలు కార్యక్రమాల నిమిత్తం 25 పంచాయతీల నుంచి క్షేత్ర సహాయకులు హాజరవుతున్నారు. అలాగే ఏపీవో, ఇంజనీరు, సాంకేతిక సహాయకులు, ఆపరేటర్లు ఇరుకు గదిలోనే విధులు నిర్వహించాల్సి వస్తోంది. పలు కార్యక్రమాలకు అధికంగా ఉపాధి నిధులే ఆధారం. ఇతర శాఖలకు నిధులు మంజూరు చేస్తే అవసరమైన సౌకర్యాలు కల్పనకు దృష్టి సారిస్తున్న ఉపాధికి నీడ కరువయ్యింది. కార్యాలయం ప్రాంగణం సరిపోకపోవడంతో కార్యాలయం వరండాలు, మండల గృహ నిర్మాణశాఖ కార్యాలయం ఆవరణలో సిబ్బంది విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒకవైపు ఎండలు, మరోవైపు వేడి గాలులు మధ్య కార్యాలయం బయట రికార్డులను తయారు చేసుకోవలసిన దుస్థితి ఉపాధికి నెలకొంది. కొంత మేర రికార్డులు నిర్వహణకు ఆటంకం నెలకొంది. ఆరుబటయే ఉంచాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ పరిస్థితి నుంచి ఎప్పుడు బయటపడతారో వేచి చూడాలి మరి.

**ఉన్నతాధికారులకు సమాచారం అందించాం**

కార్యాలయం పరిస్థితిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. కార్యాలయం నిర్మాణానికి స్థల సేకరణ, నిధులు తదితర వాటిపై నివేదికలు అందించాం.

- ఎం.గౌరీనాథ్, ఉపాధి ఏపీవో

## రాక్షస పాలనకు చరమ గీతం పాడాలి

● కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి



చినగుడబలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి

**గరుగుబిల్లి:** రాష్ట్రంలో నెలకొన్న రాక్షస పాలనకు చరమ గీతం పాడాలని కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. మండలంలోని పెదగుడబ, చినగుడబ, వల్లరిగుడబ, దళాయివలస గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన వైసీపీకి ఓటు రూపంలో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. గ్రామస్థాయిలో పార్టీ ప్రతినిధులు ఓటర్లను చైతన్యపర్చి అత్యధిక మెజార్టీ కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, ఎం.తవిటినాయుడు, ముదిలిబాబు విజయవాంకుశం, తదితరులు పాల్గొన్నారు.

**కలిసికట్టుగా విజయానికి కృషి**

**గుమ్మలక్ష్మీపురం:** కురుపాం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు కలిసి ఉత్సాహంగా పనిచేస్తున్నారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తన విజయానికి వారు శ్రమించడం ఆనందంగా ఉందన్నారు.

## నామినేషన్‌కు తరలిరండి

**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** గెలుపే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కష్టపడాలని కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. గురువారం తన నామినేషన్ కార్యక్రమానికి కూటమి నాయకులు తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు చందక అనీల్, టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, కౌన్సిలర్లు బడే గౌరునాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● **వీరఘట్టం:** సీతంపేటలో కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ బుధవారం నామినేషన్ వేయనున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్ మంగళవారం కోరారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు.

## జనసేన నాయకుల ప్రచారం

**వీరఘట్టం:** మండలంలోని చలివేంద్రి గ్రామంలో మంగళవారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బీపీ నాయుడు పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మత్స పుండరీకం, జన సైనికులు దత్తి గోపాలకృష, దత్తి సంతోష్, బలగ కాశీకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## టీడీపీలో భారీ చేరికలు



పార్టీలో చేరినవారితో విజయ సంకేతం చూపిస్తున్న విజయచంద్ర

**పార్వతీపురం రూరల్:** సీతానగరం మండలం ఏగోటివలస గ్రామానికి చెందిన సుమారు వందమంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారంతా మంగళవారం ఏగోటివలస నుంచి ప్రత్యేక వాహనాలతో పార్వతీపురం మండలం వెంకంపేట పంచాయతీలోని కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర ఇంటి వద్దకు చేరుకుని, అక్కడ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ విజయచంద్ర టీడీపీ కండువాలను వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ సీతానగరం మండల అధ్యక్షుడు పెంట సత్యం, ప్రధాన కార్యదర్శి వేణు, పార్టీ పార్వతీపురం మండల అధ్యక్షుడు బోనుదేవి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

**అన్నవరంలో..**

**పాలకొండ:** అన్నవరం గ్రామంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, పార్టీ నాయకురాలు మోజూరు తేజోవతి ఆధ్వర్యంలో మంగళవారం వీరంతా పార్టీలో చేరారు. అనంతరం వారు గ్రామంలో ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అరకు పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీతకు కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వన్నల రమేష్, శాసపు సుగుణ, సర్పంచ్ కోట సంగంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సమక్షంలో..



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న పెద్దవలస సర్పంచ్

**సాలూరు:** టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సమక్షంలో మంగళవారం పాచిపెంట మండలం పెద్దవలస పంచాయతీ సర్పంచ్ లావుజన్ని కుమారి, మాజీ సర్పంచ్ దళాయి లక్ష్మి, మంచాల సావిత్రి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. విజయనగరం జిల్లా బొండపల్లి పర్యటనలో ఉన్న ఆయన వద్దకు వెళ్లి టీడీపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి, పాచిపెంట మండల నాయకుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, పాచిపెంట మాజీ జడ్పీటీసీ మంచాల పారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయ వేటకు గిరిజనుల తిప్పలు



వేట కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్న కూనంబందవలస గిరిజనులు

**సాలూరు రూరల్:** ఇటుక పండుగ సందర్భంగా గిరిజనులు సంప్రదా యంగా తప్పనిసరిగా చేయాల్సిన క్రతువు వేటకు తిప్పలు పడుతున్నారు. వేట కోసం సుదూర ప్రాంతాలకు ఆటోలపై వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో సాలూరు ఏజెన్సీలో ఇటుక పండుగ వస్తే అడవి పందులు, కణు జు తదితర జంతువులు సులభంగా దొరికేవి. ప్రస్తుతం అడవులు తగ్గిపోవ డంతో కుందేలు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. గత నాలుగు రోజులు గా వారు రిక్తహస్తాలతో వస్తున్నారు. దీంతో సంప్రదాయంగా చేయాల్సిన వేట కోసం దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. సాధారణంగా ఇటుక పండుగ గురువారం ప్రారంభించి వేటతో మంగళవారం ముగించాల్సి ఉంటుంది. వేట దొరకుంటే పండుగ పొడిగించాల్సి పలు గ్రామాల గిరిజనులకు ఇప్పటికీ వేట దొరకపోవడంతో పండుగను పొడిగించారు. బొబ్బిలి, పార్వతీపురం ప్రాంతాలకు వేట కోసం గిరిజనులు ఆటోల్లో వెళ్తున్నారు.

## సమయపాలన పాటించాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

**బలిజిపేట:** సుభద్ర గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో ఎన్టీ రమేష్‌నాయుడు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు ఉదయం 7 గంటలకే ప్రారంభించాలని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగు చర్యలు తీసుకోవాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు ఈసీ శ్రీనివాసరావు, ఏపీవో కె.కేశవరావు పాల్గొన్నారు.

## తెర్లాం తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసులు

**కలెక్టరేట్:** విధులకు హాజరు కాని తెర్లాం తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు, జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి. తహసీల్దార్ సతిమణికి ఆరోగ్య సమస్య ఉండటంతో ఆయన ఉన్నతాధికారుల నుంచి సెలవు కోరారు. ప్రస్తుతం ఎన్నికల విధులు ఉండటంతో సెలవు మంజూరు చేయకపోవడం వల్ల, ఆయన విధులకు డుమ్మా కొట్టినట్లు తెలిసింది. దీంతో తెర్లాం తహసీల్దార్‌గా విజయనగరం ఆర్‌డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో రాజ్యలక్ష్మిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. మరోవైపు తహసీల్దార్ ప్రసన్నకుమార్‌పై సీసీఎల్‌ఏకు జిల్లా అధికారులు లేఖ రాసి, ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది.

## రాయగడలో నామినేషన్ల సందడి

ఒడిశా

**రాయగడ:** రాయగడ పట్టణంలో నామినేషన్ల సందడి నెలకొంది. మంగళవారం అధికార పార్టీకి చెందిన రాయగడ నియోజకవర్గ అభ్యర్థిని అనసూయామాఝి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పూర్వ రాజ్యసభ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు అధ్యక్షతన స్థానిక జగన్నాథ ఆలయం నుంచి భారీ ఊరేగింపుగా ఎన్నికల అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. అధికార పార్టీకి చెందిన రాష్ట్ర మంత్రి జగన్నాథ సరక బిసంకటక్ నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఇదే నియోజకవర్గానికి బీఎస్పీ అభ్యర్థిగా జీతు జకసికా నామినేషన్ దాఖలు చేశారు. గుణుపురం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా సత్యజిత్ గొమంగో, స్వతంత్ర్య అభ్యర్థి ఫాల్గుణ గొమాంగ్‌లో తమ తమ మద్దతుదారులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. దీంతో పట్టణమంతా వివిధ పార్టీల కార్యకర్తలతో నిండిపోయింది.

## చంద్రబాబును కలిసిన వీరేష్ చంద్రదేవ్



**కురుపాం/జియ్యమ్మవలస/గుమ్మలక్ష్మీపురం:** టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మంగళవారం విశాఖ వచ్చిన సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గం పరిస్థితిపై, సోమవారం జరిగిన నామినేషన్‌పై చంద్రబాబు అడిగి తెలుసుకున్నట్టు వీరేష్ తెలిపారు. పార్టీ పెద్దలు పరిటాల సునీత, పయ్యావుల కేశవ్, గంటా శ్రీనివాసరావు, అమర్నాథ్‌రెడ్డి, దామచర్ల సత్యను కలిసినట్టు చెప్పారు.

## ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారిగా నారాయుడు



నారాయుడు

**సీతంపేట:** ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారిగా సీనియర్ హెచ్ఎం పాలక నారాయుడును నియమిస్తూ ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో శోభిక మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం మల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన నియామకంపై ఉపాధ్యాయులు పీఆర్ఎంసీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## చికిత్సపొందుతూ యువకుడి మృతి

**పార్వతీపురం రూరల్:** కుటుంబ కలహాల నేపథ్యంలో మండలంలో డీకే పట్నం పంచాయతీ బొడ్డవలస గ్రామానికి చెందిన తాడంగి సాదియ్య (23) వారం రోజుల కిందట ఆత్మహత్యకు యత్నించాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆయన్ని హుటాహుటిన పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు. పరిస్థితి మెరుగవకపోవడంతో అక్కడి నుంచి ఆయన్ని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కాగా, అక్కడ చికిత్స పొందుతూ సాదయ్య మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

**పాలకొండ:** స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక ప్రదర్శన దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీలు చేస్తున్న దృశ్యం

**వీరఘట్టం:** మండలంలోని చిట్టిపూడివలస సెంటర్‌లో మంగళవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహనాలు తనిఖీ చేసింది. ఎన్నికల సమయంలో వాహనాల్లో మద్యం, డబ్బులు తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని వారు తెలిపారు.

## వడదెబ్బకు గురికాకుండా చర్యలు

**గరుగుబిల్లి:** ఉపాధి వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా ఉండేలా పని ప్రాంతాల్లో అవసరమైన చర్యలు చేపడుతున్నారు. అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం గొట్టివలసలో ఉపాధి క్షేత్ర సహాయకులు వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు.